

డా॥ దీర్ఘాసి విజయభాస్కర్

# వంశధార

ఎమెస్కో

**VAMSADHAARA**

**Dr. Deergasi Vijayabhaskhar**

**వంశధార**

చారిత్రిక దీర్ఘ కథాకావ్యం

**డా. దీర్ఘాసి విజయభాస్కర్**

సంపాదకులు: **డా. డి. చంద్రశేఖర రెడ్డి**

ముద్రణ: **జనవరి, 2019**

మూల్యం: రూ. **75/-**

టైటిల్ డిజైన్: **గిరిధర్**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రచురణ

**ఎమెస్కో బుక్స్**

1-2-7, బానూకాలనీ,

గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,

హైదరాబాద్-500029, తెలంగాణ.

e-mail : emescobooks@yahoo.com,

www.emescobooks.com

బ్రాంచ్ ఆఫీసు

**ఎమెస్కో బుక్స్**

33-22-2, చంద్రం బిల్డింగ్స్

సి.ఆర్. రోడ్, చుట్టుగుంట

విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్.

ఫోన్ : 0866-2436643

e-mail : emescovja@gmail.com

## 1

అమ్మా! వంశధారా!
మకరంద మాధుర్య రసధారా!
తెలుగు వంశ సంస్కృతికి తొలిధార!
నీ పవిత్ర జలాలు సాగర గర్భంలో
ఉమ్మనీరులా చేరిన తర్వాత
ప్రాచీ రేఖ పొత్తిళ్ళలో
బాలభానుని జననం.
నీ అఖండ జలరాశుల
ప్రభాత ప్రభా స్నాతంతో
జగాలను జ్వలింపజేసే
జవసత్వాలతనికి అమరుతున్నవి.

ఎక్కడి దమ్మా
ఈ తరతరాల తరగల సవ్వడి?
ఏ కొండలో పుట్టినవమ్మా
ఈ జలపాత జనిత జీవన ధ్వనులు?
ఏ వేణువులో పల్లవించెనమ్మా
నీ జల ఝరీ గాన లహరులు
మహా గంభీర సాగర
హృదయ సదనం చేరకముందు
ఏ దవ్వుల నడిచావో
ఏ కొండ కోనల్లో నీ చిరుపాదాల
గజ్జెలు ఘల్లుమన్నవో
నీ పదము నర్తించిన విధము
పదపదాన పల్లవించిన ప్రగతి సౌరభం
మింటికెగసిన సంస్కృతీ విశేష వైభవం
వినిపించవా తల్లీ!
వింటాను వినమ్రుడనై
చరితార్థ సంకల్ప మనస్కుడనై.

## 2

సృష్టి మర్మ మెల్ల తెలియగోరు వినయశీలా!
నా అలల వెనక దాగిన కలల్ని
ఇసుక తిన్నెల్లో ఇంకిపోయిన కథల్ని
వరదలై కొట్టుకుపోయిన రాచరిక
రాక్షస రాజకీయకేళిని
మట్టిలో మరుగుపడిన మత
మౌఢ్యపు మృత్యులీలను

సౌరాగ్నిలా ఎగసి పాటిమన్ను
పోరల్లో పాతరైపోయిన కళింగ వీరుల
శౌర్యాగ్ని కీలలను
నా ఒడిలో పుట్టి పెరిగి ప్రపంచ ప్రసిద్ధి
పొందిన నాగరికతల కతను
వెదురు పొదల్లో పుట్టిన తొలి అల
వెల్లువై సాంస్కృతిక కెరటమై ఎగిసిపడిన తీరుని
'మట్టిపెట్టె' లో పెట్టి భద్రపర్చాను
ఒక్కొక్కటి వెలికితీసి వివరిస్తాను.
కళింగం శౌర్య ప్రతాపాల వీర రంగం
జైన బౌద్ధ వైదిక చింతనా సారాంశం
అపూర్వ వైభవ విశేషాల సారంగం
స్మృతి ధార పెల్లుబుకి వచ్చే తీరున
పరవశించి, ప్రవహించి చెబుతాను
మారే శైలీ ఒరవడితో వడివడిగా
కడలిదాకా కదలిరా విజయభాస్కరా!
మేము ఐదుగురం అక్కచెల్లెళ్ళం
పుట్టింట సంసారమంతా పెద్దక్క నెత్తిమీదే!
ఎన్నాళ్ళకో గాని నోరెత్తదు
కోపమొస్తే కళ్ళురుముతుంది.
రెండోదానికి తిరుగుడెక్కువ
ఎప్పుడెక్కడుంటాదో దానికే తెలీదు
అయినాగానీ అదే అందరికీ ప్రాణం
మూడో దానికి ఒకటే రుసరుసలు
కనికరిస్తే కంటి చూపు అవుతుంది
మండిందో మాడ్చి మసిచేస్తుంది.

నాలుగోదాన్ని నేను, నడకే నా నైజం
కడదానికే కష్టాలన్నీ!
ఎంత ఓర్పు ఉన్నా ఇన్ని ఆరళ్ళా?
ఎన్నాళ్ళు భరిస్తుంది? ఎప్పుడో తిరగబడుతుంది
జన్మనిచ్చి జగతికి తెచ్చిన తల్లికి వందనాలు
మెరుపుడప్పుల మ్రోత మింట మ్రోగంగ
నవనీల మేఘాలు నాట్యమాడంగ
చినుకు చినుకుగా సాగు నా చిన్నారి తనమంత
వెదురు పొదల మధ్య 'మిన్నా జోల'
అట నుండి సాగుతుంది నా నవ్యజీవన హేల.
చుక్క చుక్క చేరి ఒక బుక్కడై
బుక్క బుక్కడు బుడుక్కుమని చేరడై
చేరడేసి చేరి చేరి గుమ్మిగా మారి
మారిన గుమ్మి రయ్యన వంకలాపారి
పారిన వంకలన్నీ ఒకటిగా కూడి వాగై
వాగులన్నీ కలిసి పాయలై హోరెత్తి
తల్లిదండ్రుల రెండు అంశలు వంశమై వర్ధిల్లినట్లు
వెదురువనంలోని పాయలు రెండు
'చౌళ దువ', 'పొలపొలయ' కలిసి
వెలుస్తాను ఒక్కటై వంశధారగా!
పర్వత శిఖరాలపై మాతృ సాన్నిధ్యం పొంది
తల్లి అంక పీఠంపై తన్మయత్వం చెంది
బురదనేలల్లోన బుడి బుడి నడకనేర్చి
గట్టు, పుట్ట, తుప్పల్లోన తప్పటడుగులు వేసి
గతుకు గుంతల్లోన గెంతులను తెలిసి

లోతైన లోయలను దూకి లయను నేర్చి
నడక సాగించు నా వడిని అందుకోలేక
ఆగిపోతారక్కడే వాగులై వంకలై
చెలులు, నెచ్చెలులు నా వంక రాలేక.
నింగిదారుల నుండి నేల సీమలకు
దూకిన నీటి బిందువు
అవుతుంది జీవికి ప్రాణ బంధువు
అజ్ఞాత శక్తుల అనంత కేళితో
భావోద్వేగాన్ని పొందిన మట్టిపై లేచిన అలలే శిలలు
శాశ్వతత్వాన్ని ఆశించే జీవికవి ఘనీభవించిన కలలు.
తల్లి రొమ్ములోకి పాలధారలు ప్రసరించినట్లు
కొండ పాలిండ్లలో నీటిచారలు గుప్పించాను
విరిసి పరచుకున్నది పచ్చదనం
ఆవరించిన వెచ్చదనంతో విత్తులు మొలకెత్తాయి
మొలిచిన మొక్కలు, అవివేసిన చిగుళ్ళు
జాలువారిన కాలపు జలపాతంతో
అణువుకి కణుపులు మొలిచి ప్రకృతిగా పరిఢవిల్లింది.
ప్రాణం పల్లవించడం ఒక వేడుక
అంతర్జ్యోతుల ప్రజ్వలనంతో
ఏకకణ జీవి నుండి పూర్ణ మానవ
పరిణామ ప్రక్రియ పరమానందకరం
పంచభూతాల పరమ నైష్ఠిక క్రతువది
భగవత్తత్వ నిరూపణకు ఋజువది.
మేమయిదుగురం ఏక సంకల్ప
సంజనితుల మైనా

సకల భువనాల గమనింపు గగనానిది.
మాకు వాటి ఊహలు కూడా గగనం.
మా ఆయాస ప్రయాసలన్నీ విహాయసం దాటవు
ఆకాశం ఏకాధిపత్యం మాలో అక్కసు పెంచింది
సకల లోకాధిపత్యం వహించే మనుజ సృష్టితో
గగన గర్వాన్ని అణచాలనుకున్నాం.
నలుగురం ఏకమై
వివిధ సంకేతాలతో సంకల్పాలు చేశాం
ప్రయోగాల యాగాలు జరిపాం
ప్రయత్నం ఫలించింది.
జీవం దృశ్యాదృశ్యంగా చలించింది.
పరిణామ క్రమంలో మనిషి మూర్తీభవించాడు
అతడు మా ఆశల ప్రతినిధి
మా శక్తుల ప్రతీక
మాకసాధ్యమైన భువన సంచయాలు
దర్శించే మాకాంక్షల ఈడేర్పరి
శిలాధాతువుల చైతన్య శిల్పం
అనంతాకాశాల్లోకి
దూసుకుపోగల దివ్య విహంగం
విశ్వాంతరాల అన్వేషి
జరిగింది గగనానికి గర్వభంగం
నేల కూలింది పెద్దక్క పెద్దరికం
సహించలేకపోయింది శూన్య తనయ
అవమానమనుకొంది నక్షత్రనయన
రోషంతో మనిషికి

మనసుగా మారింది రూప రహిత
మనసుని కీలుగా చేసి మనిషిని త్రిప్పింది.
రూపం ఇచ్చిన నాలుగు శక్తుల కక్ష్యలో
కక్షతో మనసై మసిలింది.
ఊర్ధ్వ లోకాల దృక్కులు నేలకు
మరలి మరల మరల పరిభ్రమిస్తున్నాయి.
సత్యాసత్య వివేచనలో నిత్యం పరిభ్రమిస్తున్నాయి.
శాపగ్రస్తుడయ్యాడు
శోకతప్తుడయ్యాడు మనిషి
మళ్ళీ పెద్దక్కదే పైచేయి
మేము ఓడి విరాగులమయ్యాం
విఫల యత్నంతో విసుగు చెందాం.
పుత్రవాత్సల్యం పుటుక్కుమన్నది.
మాది కాని దానిపై మాకేల మమకారమని
ముగ్గురక్కలు మనిషిపై ప్రేమ చంపుకొని
ఒక్కొక్కరు తప్పుకుంటారు
కడకు కడదాయి కడుపున దాచుకుంటుంది
ఇది మనిషి రాకపోకల వైనం
రాజైనా, బంటైనా, మాన్యుడైనా
సామాన్యుడైనా, ఆదివాసి అయినా
నగర నివాసి అయినా
మనిషిపై ఆవరించిన ప్రకృతి శక్తుల నీడ
అతని పేరున జరిగే నిరంతర జీవక్రీడ
మహోగ్ర జీవ విస్తరణలో వనజాతులు, జనజాతులు
జనించి జ్వలించాయి.

స్పందన పొందిన ప్రాణి భూచరమై చలించింది.
జలచరమై గమించింది
భూచరమై విహరించింది
మానవ సృష్టి విలంబనమైనా
భువిపై లంబంగా నిలిచాడు
రాతి యుగం, రాగి యుగం
మంచు యుగం, కంచు యుగం
కాళ్ళ క్రింద పడుతున్న కాలయవనికలు
అధిగమిస్తూ నడుస్తూనే ఉన్నాడు మనిషి
అవని మొత్తం అడవిలా ఉన్నప్పటి మాట
పాడితప్ప పంట వినబడలేదప్పుడు ఎవరినోట
పిందె, కాయ, పండు దొరికినదే తిని బ్రతికేరు
పశుపాలన వృత్తిగా పచ్చిక బయళ్ళకై వెతికారు.
భూమిపై విత్తు మొలకెత్తడం చూసి మనిషి
ఆరంభించాడు పలు విధాలైన పంటలపై కృషి
నాగలి నేలను, తమకంతో ముద్దాడింది
నేల పులకించి పంటల్ని ప్రసవించింది
ఖోండులు, సోరలు ఆటవిక తెగలు
హరిజనులు, పురజనులు
మానవ గుంపులు జట్లు జట్లుగా
పురపథగాములై, పురోభివృద్ధి కాముకులై
జనపథాల వైపు నడిచారు.
కాశీ, కోసల, అంగ, కళింగ, మగధ, మల్ల,
వత్స, మత్స్య, కురు, పాంచాల, చేది, శూరసేన,
అస్మక, అవంతి, వజ్జి, గాంధార జనపదాల మహాజనులు
పలు పదాలుగా నాగరిక జీవనాభిముఖులయ్యారు.

## 3

శివుని జటాజూటంలా విస్తరించిన
పర్వత శ్రేణుల్లో దాగిన అపర సింధువును
నేలపై పొంగి పొర్లిన కళింగ గంగను
గంగ ఉన్న చోట గరళ కంఠుడుంటాడు
పార్వతికి విషాగ్ని సాకుగా చూపి
విరహాగ్ని చల్లబడ ఈశ్వరుడు మత్స్యమై వచ్చాడు.
మీన కేశుడై నా సరసన వెలిశాడు.
శివుని పాదానికి గంతులు నేర్పిన స్థలమిది
ఆది స్వరానికి సంగతులు కూర్చిన ప్రదేశమిది
లయకారుడు హొయలు లయలు
నేర్పిన రంగస్థలమిది.
ఆనాడు మతంకన్న మానవ హితమే మిన్న
పురోహితుడు లేడు పురహితుడు తప్ప
దేవాలయం కాదు సమాజ దేవళం తప్ప
భక్తిని మించి ఉన్నాయి శ్రద్ధాసక్తులు
జనన మరణ క్రీడ కొనసాగుతోంది
అప్రతిహతంగా
అప్రతిభుడైన మానవ హతంగా
నాలుగు శక్తుల ప్రకోపం
మనః ప్రదర్శిత ప్రతాపం
మదమత్సర కామక్రోధాలు
అయ్యాయి జ్ఞానోన్నతికి అవరోధాలు.
నదుల సరసన నగరాలు వెలిసాయి
వ్యాపార, సమాచార ప్రసారానికి, వాహికలయ్యాయి

ఒకచోట మొలకెత్తిన సంస్కృతీ
సంప్రదాయాలు నదీ జలాలతో పొరలి ప్రవహించాయి.
గంగ ఒడ్డున వెలసినవే కాశీ, ప్రయాగలు
కృష్ణ కావేరీల కౌగిలిలో తమిళ ప్రాంతం
వైగై ధారలకు, పెన్నార్ పరవళ్ళకు
చిగురించినదే చోళ సామ్రాజ్యం
టాపీ భీమా నదుల పరివృతం మహారాష్ట్రం
దేశ మాత ధరించిన భూ జరీ చీరకు
రెండు అంచుల జలతారు
తూర్పున కోరమండల మైతే పశ్చిమాన మలబారు
తీరం వెంబడి విస్తరించిన నారికేళ కేరళం
గోదావరి, మహానది నుండి గంగల మధ్య కళింగ రాజ్యం
పాలిత ప్రాంతమేదైనా
పాలించిన వంశమెవరైనా
నీటి చుక్కే రాజ్య అవతరణకు వేగు చుక్క
అని దిగమ్రింగిందో గుక్క
ఏ తలపులు తలుపులు తట్టాయో!
ఏ స్మృతుల దొంతర వంతులు కట్టి
మనసుని వేధించాయో
ముఖం ఎర్రబడి మ్లానమయ్యింది.
స్వరం తడబడి జీరకట్టింది
జ్ఞాపకాల వాగుల్ని పోగేసుకుంటూ
జలజలాపారే వంశధారయ్యింది
మారింది అమ్మ మాటల పోహళింపు
అమ్మ ముఖంలో ప్రస్ఫుటమౌతున్నది
కదన భూమిలో ఇరుసైన్యాల మోహరింపు.

## 4

అదిగదిగో అదే కళింగం
ఆంధ్ర ఓండ్ర భాషల సంగమం
రెండు నదులకూ నడుమన విరిసెను
సౌభాగ్యమ్ముగ కళింగ దేశము

రెండు రాజధానులతో వెలిగిన
ధర్మ తేజమే కళింగ రాజ్యము
రాజసమొలికే రెండు తెగలతో
అలరారిన సిరి పవిత్ర భూమియె

కళింగ సంస్కృతి కనుల పంటగా
వెలిగిన నగరం దంత పురమ్ము
జగన్నాథుడే యిలలో వెలసిన
జయకేతన మౌ రాజపురమ్మది

రెండు పురమ్ములు రథ చక్రములై
పరుగు పరుగునా పరిగెడుతున్నది
కళింగ వైభవ యశోస్యందనము
వినువీథుల కేతన మెగురవేసి

మధ్య భారతపు మాగధ రాజులు
తూర్పు తీరమున కళింగ యోధులు
ఒకరిని మించిన ఒకరు ధీరులు
సమ ఉజ్జీలే సఖ్యత పూజ్యం

కళింగాన్ని కబళించ మగధకు
కాంక్ష నిండినది మనస్సునిండా

మగధరాజ మహా పద్మనందుడు
దండు వచ్చెనదె కళింగ భూమికి

శక్తి వంచనలేక పోరాడి పోరాడి
పోరాడి ఓడింది పోనుపైన కళింగం
నాడుగా మగధకిది సామంతరాజ్యం
విధిని తెలియుటెల్ల విధికే నసాధ్యం

జైన తీర్థంకరుడు శీతల నాథుడు
అతడు కళింగ ప్రజల కారాధ్య దేవుడు
అతని విగ్రహమ్ము తరలించుకొనిపోయె
కళింగ ప్రజలకదె తలవంపులై పోయె

ఏ రాజ్యమెక్కడా శాశ్వతమ్ముగ లేదు
రక్త దాహమ్మెపుడు చరితయై మనలేదు
నందరాజుల బలిమి నాశనమ్మైపోయె
మౌర్యపతాక మదియె మగధపై నెగిరింది

చంద్రగుప్తుని మనసు సాప్త పదమయ్యెనో
చాణక్యుడాతనికి బోధనే చేసెనో
స్నేహ పరిమళాలు కళింగముపై పరచె
సాగరపు తీరాన శాంతపవనము వీచె

కొనసాగ లేదతని కోర్కె కడపటి దాక
కొడుకు బిందుసారుడగ్ని రాజేశాడు
రగిలింది పొగిలింది రాజ్యాల గుండెలన్
అశోకుని సరి కదియె యుద్ధమై మిగిలింది.

చరిత రక్తాశ్రువుల చిలికించు ఘటన యది
శాంతి హృదయుల ఎదకు మరణ విష మృదంగము

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Vamsadhara](http://kinige.com/book/Vamsadhara)**

* * *